నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 17 ఏప్రిల్ 2025 | HYDERABAD

ప్రభుత్వ ఉద్యోగిపై బీజేపీ కార్పొరేటర్ దాడి

పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కార్పొరేటర్‌పై క్రిమినల్ కేసు నమోదు

మల్కాజిగిరి, ఏప్రిల్ 16 : ప్రభుత్వ ఉద్యోగిపై బీజేపీ కార్పొరేటర్ దాడి చేశారు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... హార్టికల్చర్ విభాగంలో సూపర్‌వైజర్‌గా వెంకటేశ్‌కు ఓ మహిళ రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని రెండు నెలల కిందట ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ శివపూరిలోని తన కార్యాలయానికి సూపర్‌వైజర్ వెంకటేశ్‌ను పిలిపించారు. చెట్ల కొమ్మలను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. అక్కడ 11 కేవీ కరెంట్ వైర్లు ఉన్నాయి..కాబట్టే ఇప్పటి వరకు తొలగించలేదని వెంకటేశ్ సమాధానం చెప్పారు. ఈ క్రమంలో వెంకటేశ్‌పై కార్పొరేటర్ శ్రావణ్ చేయి చేసుకొని, బెదిరించారు. జరిగిన విషయాన్ని సూపర్‌వైజర్ వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ పైన క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిటీకి వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. బుధవారం నగరంలో గరిష్ఠం 37.0, కనిష్ఠం 23.6 డిగ్రీలు, గాలిలో తేమ 39శాతంగా నమోదైనట్లు తెలిపారు.

సర్కారు స్థలం ఆక్రమణ

సుమారు 60 కోట్ల విలువ

అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆక్రమణల కూల్చివేత

బంజారాహిల్స్,ఏప్రిల్ 16: సుమారు రూ. 60 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలను షేక్ పేట్ మండల రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్తే.. షేక్ పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్. 12 పోలీస్ కమాండ్ కంట్రోల్ పక్కన సర్వే నంబర్ 403లోని టీ ఎస్ నంబర్..5, బ్లాక్ హెచ్ వార్డ్ 10లోకి వచ్చే సుమారు 3వేల గజాల స్థలాన్ని ప్రైవేట్ స్థలం అంటూ కొంతమంది వ్యక్తులు కొన్ని రోజులుగా చదును చేస్తున్నారు. సమాచారం అందుకున్న షేక్ పేట్ మండల తహసీల్దార్ అనితారెడ్డి ఆదేశాలతో బుధవారం రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆక్రమణలు కూల్చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన కంటైనర్‌ను ధ్వంసం చేశారు. ఈ స్థలం విలువ సుమారు రూ. 60 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదిగా ఉందని, స్థలంలోకి ప్రవేశించిన వారిపై చర్యలు ఉంటాయని తహసీల్దార్ అనితారెడ్డి హెచ్చరించారు.

అడుగడుగునా ఉల్లంఘనలే..

ఫిలింనగర్‌లో బీజేపీ నేత అక్రమ నిర్మాణాలు.. కోర్టు ఆదేశాలున్నా జాప్యం చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 16 : జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు.. ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఏకంగా ఆరు అంతస్తుల్లో భవన నిర్మాణం.. అక్రమ నిర్మాణాన్ని కూల్చేయాలని హైకోర్టులో ఆదేశాలు.. అయినా జీహెచ్ఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. షేక్‌పేట మండలం ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌లో బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన బీజేపీ నేత హెచ్.వెంకట్‌రెడ్డి కొంతకాలంగా సుమారు 180 గజాల్లో 6 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ స్థలంలో గతంలో పేదల కోసం 4 (బీపీఎల్) వాంబే ఇండ్లు ఉండేవి. ఎస్‌సీ, బీసీలకు చెందిన పేదలకు గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ఇండ్లను బీజేపీ నేత వెంకట్‌రెడ్డి అక్రమంగా కొనుగోలు చేయడంతో పాటు ఈ స్థలంలో సుమారు 60 గజాలను జీవో 59 కింద తన భార్య నర్మద పేరుతో క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. రెవెన్యూ నిబంధనల ప్రకారం వాంబే గృహాలను లబ్ధిదారుల కుటుంబాలు మాత్రమే ఉపయోగించుకోవాలి తప్ప..వేరేవారికి అమ్మరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అయినా తప్పుడు సమాచారం ఇచ్చి 60 గజాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్న వెంకట్‌రెడ్డి.. మిగిలిన స్థలాన్ని కలుపుకొని ఇటీవల బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో బస్తీవాసులు జీహెచ్ఎంసీకి, షేక్‌పేట మండల తహసీల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో పాటు ఇటీవల స్థానికంగా నివాసముంటున్న కొంతమంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా, వెంటనే అక్రమ నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం కూల్చివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో జీహెచ్ఎంసీ సర్కిల్-18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వెంకట్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే నిర్మాణదారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో 15రోజుల్లోగా కూల్చివేతలు చేపడతామని స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేశారు. అయితే అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కిన నిర్మాణదారులు పనులు కొనసాగుతున్నారు. ఆదేశాలు జారీ చేసి రెండునెలలు గడిచినప్పటికీ ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారుల వ్యవహార శైలిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ అధికారుల తీరుపై ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం ప్రస్తావించడం గమనార్హం. ఇదిలా ఉండగా, మొత్తం స్థలంలో 60 గజాలను జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్న వెంకట్‌రెడ్డి..మరో 120 గజాల స్థలాన్ని లబ్ధిదారుల నుంచి అక్రమంగా తీసుకున్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఇప్పటికే షేక్ పేట మండల రెవెన్యూ సిబ్బంది ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. సదరు స్థలంలోని బిల్డింగ్‌ను సీజ్ చేయాల్సిన రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిలింనగర్‌లో బీజేపీ నేత వెంకట్‌రెడ్డి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

అక్రమంగా స్థలం కొన్నట్లు తేలింది

ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌లో పేదల కోసం గత ప్రభుత్వాలు ఇచ్చిన స్థలాన్ని వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసినట్లు మా విచారణలో తేలింది. కొంత స్థలాన్ని జీవో 59 కింద క్రమబద్ధీకరణ చేయించుకున్నా, క్రమబద్ధీకరణ చేయించుకోని స్థలంలో అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేసినట్లు గుర్తించాం. ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం. పేదలకు ఇచ్చిన స్థలాన్ని కొనుక్కోవడం నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుంది. స్థలాన్ని సీజ్ చేసి స్వాధీనం చేసుకుంటాం.

- షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

ప్రభుత్వ భూమి కాజేసేందుకు పెద్ద కుట్ర

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్నుపడుతున్నది. రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. తాజాగా కుర్మల్‌గూడ సర్వేనంబర్ 80లోని స్థలం ఆక్రమణకు యత్నించగా, అధికారులు జేసీబీతో అక్రమ నిర్మాణాలను తొలగించారు.

బడంగ్‌పేట, ఏప్రిల్16: రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం కుర్మల్ గూడ సర్వే నంబర్ 80లో ఉన్న ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. రాత్రికి రాత్రి పెద్దపెద్ద షెడ్లు వెలిశాయి. గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వ భూమిని కాజేసేందుకు బిగ్ స్కెచ్ వేశారు. గతంలోనే ఆ భూమిని కాజేయడానికి ఏకంగా వెంచర్ చేశారు. ప్లాట్లుగా చేసి కొంతమందికి విక్రయించారు. గతంలో ఉన్న తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అది ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్లాట్లుగా చేసిన వాటిని తొలగించి.. సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న భూ ఆక్రమణదారులు మరోసారి కబ్జా చేయడానికి ప్లాన్ వేశారు. ఈ క్రమంలో ఏకంగా షెడ్లు వెలిశాయి. స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఇందిరా దేవి ఆదేశాల మేరకు అధికారులు అక్రమ నిర్మాణాలన్నింటినీ జేసీబీతో తొలగించారు. కాగా, బాలాపూర్ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇందిరా దేవి చెప్పారు. ప్రభుత్వ భూముల్లో రాత్రికి రాత్రి నిర్మాణాలు వెలుస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కూర్మల్ గూడ సర్వేనంబర్. 80 లో ఉన్న భూమి అంతా ప్రభుత్వానిదేనని ఆమె స్పష్టం చేశారు.

వేతనాలు సకాలంలో చెల్లించండి

శామీర్‌పేట: పంచాయతీ కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేత మల్లేశ్‌యాదవ్ అన్నారు. అలియాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న కార్మికుల సమ్మె బుధవారం నాటికి14వ రోజుకు చేరింది. కార్మికులు రోడ్డుపై బైఠాయించి..నిరసన తెలిపారు.

కమిషనర్‌ను అడ్డుకొని..

కీసర: మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదంటూ దమ్మాయిగూడ మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ధర్నాకు దిగారు. సుమారు 200 మంది కార్మికులు సీఐటీయూ, ఐఏఫ్టీటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించారు. కార్యాలయానికి వెళ్తున్న కమిషనర్ నాగమణిని అడ్డుకొని జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాక్సింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గోల్కొండ కేంద్రీయ మహా విద్యాలయం(కేవీ)లో బుధవారం బాక్సింగ్ చాంపియన్‌షిప్ హోరాహోరీగా సాగింది. మొత్తం 37 మంది విద్యార్థులు పోటీపడుతున్న టోర్నీలో తొమ్మిది బౌట్లు జరిగాయి. ఇందులో వెంకట్ చరణ్(50కి), అలేఖ్య(42కి), మీరా హుస్సేన్ ఆలం(63కి), ఆయేషా(81కి), లోహిత్(50కి), రియాన్ మిస్బా(46కి), లక్ష్మణ్(46కి) జాతీయ టోర్నీకి ఎంపికయ్యారు.

అనుమతి లేదు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ ప్రాంతంలోని సర్వే నంబర్ 215లో చేపట్టిన 'శేషాద్రి సిల్వర్ ఓక్' రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతి లేదని రెరా స్పష్టం చేసింది. కృతిక ఇన్ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ ప్రాజెక్టుపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదు అందినట్టు రెరా తెలిపింది. ఈ ప్రాజెక్టు రెరాలో రిజిస్టర్ కాలేదని, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ నుంచి బిల్డింగ్ నిర్మాణ, లేఅవుట్ అనుమతి పొందలేదని పేర్కొన్నది. రెరా చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఆ కంపెనీ ఎండీ డీ శ్రీకాంత్‌పై గత ఏడాది డిసెంబర్‌లో కేసు నమోదుచేయడంతోపాటు సుమారు రూ.10 లక్షల జరిమానా విధించినట్టు వెల్లడించింది.

బల్దియాలో చెత్త పంచాయితీ

జవహర్ నగర్‌కు సిల్ట్ తరలింపుపై అభ్యంతరాలు

చెత్త ఒత్తిడి పెరిగిందని, జోనల్ లెవల్‌లోనే స్థలాలు చూసుకోవాలని ఆదేశాలు

ఇప్పటికిప్పుడు సాధ్యం కాదంటున్న జోనల్ కమిషనర్లు

వచ్చే ఏడాది నుంచి అనివార్యమని కమిషనర్ ఆదేశాలు

క్వారీలు, ఖాళీ స్థలాల గుర్తింపునకు జోనల్ కమిషనర్ల చర్యలు

ఏటా నాలాల నుంచి 5 లక్షల క్యూబిక్ మీటర్ల సిల్ట్ వెలికితీత

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఘన వ్యర్థాల నిర్వహణ జీహెచ్ఎంసీకి సవాల్‌గా మారింది. ఒక వైపు గ్రేటర్ నలుమూలల నుంచి రోజూ సగటున 7,500 మెట్రిక్ టన్నుల చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. దీనికి తోడుగా నాలాల నుంచి వెలికితీసిన సిల్ట్(పూడిక)కు తోడుగా భవన నిర్మాణ వ్యర్థాలను సైతం ఈ డంపింగ్‌కే తరలిస్తుండడంతో ఒత్తిడి పెరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ప్రతిఏటా నాలాల్లోంచి తీసిన సిల్ట్‌ను కూడా తరలిస్తుండడంతో ఇకపై అలా కుదరదని సంబంధిత నిర్వహణ విభాగం ఇంజినీర్లకు స్పష్టం చేశారు. ఇప్పటికే అక్కడ పేరుకుపోయిన చెత్తతో ల్యాండ్‌ఫిల్ స్థలం లేకుండా పోతున్నదని, దానికి తోడు సిల్ట్‌ను కూడా అక్కడికే తరలిస్తే సమస్యలు మరింత ఉత్పన్నమవుతుందని ఏ జోన్‌లోని సిల్ట్‌ను ఆ జోన్‌లోనే తరలించేందుకు తగిన స్థలాలు చూసుకోవాల్సిందిగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఇప్పటికిప్పుడు స్థలాల ఎంపిక సాధ్యం కాదని జోనల్ కమిషనర్లు తేల్చి చెప్పారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలైన క్వారీ గుంతలు, ఇతర డంపింగ్ స్థలాలపై అధ్యయనం చేసేందుకు సమయం పడుతుందని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ ఏడాది మాత్రం జవహర్ నగర్‌కే సిల్ట్‌ను తరలించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, వచ్చే ఏడాది మాత్రం సిల్ట్‌ను జోనల్ లెవల్‌లోనే డంపింగ్ చేసుకునే అనువైన స్థలాలను ఎంపిక చేసే బాధ్యత మీదేనంటూ జోనల్ కమిషనర్లకు కమిషనర్ తేల్చి చెప్పారు.

5 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక

జీహెచ్ఎంసీ పరిధిలో వరద నీటి కాలువల పొడవు 1302 కిలోమీటర్ల మేర ఉండగా.. 390 కిలోమీటర్లు మేజర్ నాలా, మైనర్ డ్రెయిన్స్ 912 కిలోమీటర్లు మేర ఉన్నాయి. ప్రతి ఏటా మాదిరిగానే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు పునరుద్ధరణ, మరమ్మతులు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం ఏటా దాదాపు రూ. 55 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఏటా దాదాపు 5 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను వెలికితీస్తున్నారు. నాలాల నుంచి వెలికితీసిన ఈ చెత్తను జవహర్ నగర్‌కు తరలిస్తున్న అధికారులు.. వచ్చే ఏడాది ఎక్కడకు తరలించాలన్న దానిపై ఆలోచనలో పడేసింది. కాగా, సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో చెత్త నిర్వహణ కేంద్రానికి స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తం కావడంతో దానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ తరుణంలోనే సిల్ట్‌ను తరలింపునకు అనువైన స్థలాలను జోనల్ లెవల్‌లో ఎంపిక చేయడం సవాల్‌గా లాంటిదేనని జోనల్ కమిషనర్లు చెబుతుండడం గమనార్హం. భవిష్యత్‌లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే..

నాలా పూడిక తీత పనుల వివరాలు (జోన్ల వారీగా)

జోన్	పనులు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)
ఎల్బీనగర్	5	540.74
చార్మినార్	85	1759.10
ఖైరతాబాద్	61	1124.48
శేరిలింగంపల్లి	7	810.50
కూకట్‌పల్లి	6	638,90
సికింద్రాబాద్	39	630.35

(కాగా వీటిలో రూ.50.58కోట్ల విలువైన 182 పనులు కొనసాగుతున్నాయని, మిగతా 21 చోట్ల పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు అధికారులు చెబుతున్నారు).

50 అడుగుల కేసీఆర్ కటౌట్

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పార్టీ అధినేత కేసీఆర్ భారీ కటౌట్‌ను వినూత్నంగా తయారు చేయించారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్. బంజారాహిల్స్‌లోని తెలంగాణభవన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కేసీఆర్ కటౌట్(సుమారు 50 అడుగుల ఎత్తు) ప్రత్యేకత అందరినీ ఆకట్టుకుంటోంది. చెన్నై నుంచి వచ్చిన కళాకారులు ప్రత్యేకంగా భారీ కటౌట్‌ను తయారు చేయడంతో పాటు కేసీఆర్ మోచేయి వెనకభాగంలో మోటర్‌ను బిగించి అభివాదం చేస్తున్న విధంగా కనిపించేలా తీర్చిదిద్దారు. 25 ఏండ్ల బీఆర్ఎస్ పార్టీ ప్రయాణం సందర్భంగా వినూత్నంగా ఏదైనా చేయాలనిపించి ఈ కదిలే కటౌట్‌ను తయారు చేయించామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు.

- బంజారాహిల్స్, ఏప్రిల్ 16

ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారానికి ముందు బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్ గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపానికి ఘనంగా నివాళులర్పించారు. దాసోజు శ్రవణ్‌కుమార్ వెంట ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. -తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 16

హద్దుమీరితే.. కటకటాలే!

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు..నిఘా పెంచిన పోలీసులు.. 12 గ్యాంగ్‌లకు కౌన్సిలింగ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): ఫలక్‌నామాకు చెందిన మాస్‌యుద్దీన్ అనే రౌడీషీటర్‌ను దారుణంగా హత్యచేశారు. ప్రత్యర్థులే అతనిని హత్యచేశారని పోలీసులు చెప్పారు.

ఈదీ బజార్‌లో ఓలా రైడర్‌ను డబీర్‌పురా పీఎస్ పరిధిలో స్థానిక రౌడీషీటర్ అడ్డుకుని..ఏటీఎం కార్డు తీసుకుని నగదు డ్రా చేసుకుని పంపించేశాడు.

ఇలా హైదరాబాద్‌లో రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. హత్యలు, బెదిరింపులు, ప్రైవేటు సెటిల్‌మెంట్లు భారీ స్థాయిలో కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రౌడీషీటర్ల కట్టడికి పోలీసు యంత్రాంగం కఠిన వైఖరి అవలంబిస్తోంది. పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో ఎస్‌హెచ్‌ఓలు, టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ వర్గాలు రౌడీషీటర్లు, పాతనేరస్తుల కార్యకలాపాలు, సోషల్‌మీడియాలో వారు చేస్తున్న పోస్టులను గమనిస్తూ హద్దు మీరిన వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

1517 మంది రౌడీషీటర్లు..

నగర పరిధిలో 1517 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 20 శాతం వయోభారంతో ఇంటికే పరిమితమయ్యారు. 40 నుంచి 50 మంది వరకు కరుడుగట్టిన రౌడీషీటర్లు. ప్రత్యర్థుల నుంచి ముప్పు ఉందంటూ అక్రమంగా ఆయుధాలు కొనుగోలు చేస్తున్నారు. లంగర్‌హౌజ్‌లో ఓ రౌడీషీటర్ ప్రాణ భయంతో రూ.2లక్షలు పెట్టి తుపాకీ కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించి అతనిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు మారణాయుధాలతో తిరుగుతుండగా, వారిపై కూడా కేసులు పెట్టారు. గోషామహల్‌లో ఓ రౌడీషీటర్ తన గ్యాంగ్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు అతనిని స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లలో ఎక్కువగా సౌత్‌జోన్‌లో 399 మంది ఉండగా, నార్త్‌లో 185, సెంట్రల్‌లో 114, వెస్ట్‌లో 177, సౌత్ ఈస్ట్‌లో 233, సౌత్ వెస్ట్‌లో 293, ఈస్ట్‌లో 116 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టిన పోలీసులు.. ఏదైనా తేడా అనిపిస్తే కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఇటీవల 12 గ్యాంగ్‌లకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.